ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

బండ్లగూడ, ఆగస్టు 22 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు వెరిఫికేషన్ తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి కమిషనర్ శరత్‌చంద్ర మూడు బృందాలను ఏర్పాటు చేసి లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ హక్కుల రికార్డు బిల్లుపై చర్చించాలి

హిమాయత్‌నగర్, ఆగస్టు 22: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చే తెలంగాణ భూ హక్కుల రికార్డు బిల్లుపై విస్తృతంగా చర్చించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ స్థాయిల్లో రైతులతో సమావేశమై నిర్దిష్టమైన చట్టాలను తీసుకువచ్చి భూ సమస్యలను గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించి బహిర్గతం చేయాలన్నారు. వ్యవసాయ భూమి వివరాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. గ్రామాల వారీగా రికార్డులను తయారు చేసి, అనంతరం డిజిటలైజ్ చేయాలన్నారు. పహాణి, కాస్తు కాలం కొనసాగించి గ్రామ స్థాయిల్లో రెవెన్యూ అధికారి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల భూములకు చట్టబద్ధంగా పూర్తి రక్షణ కల్పించే విధంగా భూమి హక్కుల రికార్డు బిల్లు ఉండాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీపై నిరసనలకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

- పోలీస్ అకాడమీ వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలికిన స్వామిగౌడ్, నాగరాజు
- చేవెళ్లకు తరలిన నాయకులు

చేవెళ్లలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి రాజేంద్రనగర్ నుంచి తరలిన బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పోలీస్ అకాడమీ వద్ద స్వాగతం పలికిన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, నాగరాజు

బండ్లగూడ,ఆగస్టు 22 : రైతులకు రెండు లక్షల వరకు రూణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక రూణమాఫీని అందరికీ వర్తింపజేయలేదని బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేవెళ్ల మండల కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. తెలంగాణ పోలీస్ అకాడమీ వద్ద కేటీఆర్‌కు మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, సీనియర్ నాయకుడు ఆర్. నాగరాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్య కర్తలు కేటీఆర్ వెంట తరలారు. రాజేంద్రనగర్ నుంచి ధర్మ రెడ్డి,రఘుయాదవ్ తదితర డివిజన్ అధ్యక్షుల సమక్షంలో నాయకులు తరలి వెళ్లారు. కోలన్ సుభాస్‌రెడ్డి, చిత్తారి, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మణికొండ : హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తిక్‌రెడ్డి అన్నారు. రుణమాఫీని ఎలాంటి అంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేవెళ్లలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి మణికొండ నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ రైతు రుణమాఫీ కొందరికే చేసి మరికొందరికి చేయలేదన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసగిస్తున్నదని, త్వరలో కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, బీఆర్ఎస్ మణికొండ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. ధన్‌రాజ్, కౌన్సిలర్ నవీన్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు రూపా రెడ్డి, లక్ష్మయ్య, లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, బబ్లూ, కిరణ్, శ్రీధర్‌గుప్తా, దీలిప్, శివ, ప్రవీణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కార్తిక్‌రెడ్డితో మణికొండ మహిళ నాయకులు

కేటీఆర్ ధర్నాకు తరలిన నాయకులు

శంషాబాద్ రూరల్ : చేవెళ్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో రైతు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమానికి శంషాబాద్ నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

నిరుపేదలకు అండగా ఉంటా..

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్, ఆగస్టు 22: నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పునరుద్ఘాటించారు. గురువారం వెంగళరావునగర్, షేక్‌పేట్ డివిజన్లకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఏ కష్టమొచ్చినా తాను అండగా నిలబడతానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంజీవ కుటుంబసభ్యుల్ని పరామర్శించిన ఎమ్మెల్యే

బీఆర్ఎస్ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ తోడల్లుడు దాసరి రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గురువారం సంజీవ కుటుంబంతో పాటు.. వారి బంధువులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కళలకు ఆదరణ పెరగాలి : మంత్రి సీతక్క

ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించిన మంత్రి సీతక్క

వెంగళరావునగర్, ఆగస్టు 22 : చిత్ర కళలకు మరింత ఆదరణ పెరగాలని, ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తున్నదని మంత్రి సీతక్క అన్నారు. ఇందిరానగర్‌లో వాసు యాడ్స్ వారు ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని గురువారం మంత్రి ప్రారంభించారు. అత్యద్భుతమైన చిత్రకళలో ప్రావీణ్యం ఉన్న వాసు భాస్కరాల ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మాజీ టీఎఫ్‌సీసీ చైర్మన్ పుష్కర్ రామ్‌మోహన్‌రావు, నటుడు శివారెడ్డి, బాబురావు, మేకల సారంగపాణి, నాగబాల సురేశ్‌కుమార్, మిట్టపల్లి సురేందర్, తైదల బాపు, శ్యామ్, అంబర్‌పేట్ శంకర్, విజయ్‌భార్గవ్, సౌజన్య పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

చిక్కడపల్లి, ఆగస్టు 22 : సామాజిక సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ పీఆర్ఓ రమణ, అతని కుమారుడు సాయి రితీష్ ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత మధుమేహం పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. జి.రమణ గత 30 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, ఆంజనేయస్వామి ఆలయ ఈవో మాచర్ల దేవనాథం, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఎన్ఎన్ మూర్తి, లయన్ రఘు, పీవీ సాయి, రామచంద్రరావు, జి.రత్నాకర్, యమున, కల్పన, నరసింహారావు, విజయ దుర్గ, సతీశ్, రాజేశ్ పాల్గొన్నారు.

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి



శంషాబాద్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 22 : సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్ డిమాండ్ చేశారు. గురువారం శంషాబాద్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం డిప్యూటీ తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయంలో తెలంగాణతో ఎలాంటి సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ విగ్రహ ఏర్పాటు సీఎం రేవంత్‌రెడ్డి అవివేకానికి నిదర్శనమన్నారు. రాజీవ్ విగ్రహం ఏర్పాటు చేస్తే ప్రజలు సీఎంకు తగ్గిన బుద్ధి చెబుతారన్నారు.

రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి కేవలం 40శాతం మందికే చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. రైతులను నమ్మించి మోసం చేసిన రేవంత్‌రెడ్డికి రైతులే స్వయంగా శవయాత్ర చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దిద్యాల శ్రీనివాస్, మోహన్‌రావు, రాజశేఖర్‌గౌడ్, రాజేందర్, రమేశ్, గోపాల్, పరందాములు, నాగేశ్, శ్రీనివాస్, మహేశ్, చెన్నకేశవ్, మురళి, శ్రీశైలం, మహేశ్‌యాదవ్, డి రాజు, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభం

ముషీరాబాద్, ఆగస్టు 22: ముషీరాబాద్ డివిజన్, ఫకీర్‌వాడ భారత్ సేవా సమాజ్ పక్క గల్లీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ అసెంబ్లీ కో కన్వీనర్ నవీన్‌గౌడ్, నాయకులు కంచి ముదిరాజ్, సత్యనారాయణ, గిరి, రాకేశ్, బాలకృష్ణ తదితరుల పాల్గొన్నారు.

పాషా కాలనీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

మణికొండలో కూల్చివేసిన అక్రమ నిర్మాణం

మణికొండ, ఆగస్టు 22 : అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ పాషా కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన మూడు, నాలుగు, ఐదు, ఆరు అంతస్తులను ఆయన సిబ్బందితో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ అనుమతులు తీసుకున్న మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మిస్తే ఊపేక్షించేది లేదని హెచ్చరించారు.

వివాదాస్పద స్థలంలో భూమి పూజ చేయొద్దు..

ఖైరతాబాద్, ఆగస్టు 22 : కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో భూమి పూజకు హాజరుకావద్దని అధ్యాత్మికవేత్త శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామిని భూ యజమానుల తరపు న్యాయవాది ఎండీ అబ్దుల్ ఇమ్రాన్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహింపట్నం మండలం కొంగరకలాన్ సర్వే నంబర్ 61లో మొత్తం 14 ఎకరాల స్థలం ఉందన్నారు. అందులో నాలుగు ఎకరాలు అమీర్‌షరీఫ్, సయ్యద్ కలీముల్లా హుస్సేనీ, సయ్యద్ సైపుద్దీన్‌లకు చెందిందని తెలిపారు. ఇందులో అద్భుతమైన భవంతిని నిర్మిస్తామని 2021లో ఓ నిర్మాణ సంస్థ రూ. 8.50 కోట్లకు ఒప్పందం చేసుకుని రూ. 2.50 కోట్లు సైతం చెల్లించిందన్నారు. అయితే మరో రూ. 6 కోట్లు చెల్లించకుండా తాత్సారం చేస్తుండడంతో భూ యజమానులు సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారని, దీంతో వారికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. అయితే నిర్మాణ సంస్థ యజమానులు మళ్లీ హైకోర్టులో పిటిషన్ వేశారని, ప్రస్తుతం ఆ కేసు నడుస్తుండగానే ఈ నెల 24న భూమి పూజ, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చిన్న జీయర్ స్వామిని ఆహ్వానిస్తున్నారని తెలిపారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో ప్రారంభోత్సవానికి వస్తే చెడ్డపేరు వస్తుందని, విరమించుకోవాలని చిన్నజీయర్ స్వామికి వినతిపత్రం పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ యువతకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్, ఆగస్టు 22 : ఎస్సీ యువతకు డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని ఎస్సీ యువతకు హకీంపేటలో లైట్ మోటర్ ట్రైనింగ్, హెవీ మోటర్ మెహికిల్ డ్రైవింగ్‌లో 38 రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. అర్హులైన వారికి ఉచిత భోజనవసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 20 ఏండ్ల వయసు పైబడిన యువ కులు అర్హులని, కులం, ఆదాయం, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, ఇతర జిరాక్స్ పత్రాలను అందజేయాలన్నారు. పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన వారికి పర్మనెంట్ లైసన్స్ ఇప్పిస్తామని తెలిపారు. అసక్తి గల వారు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

శంషాబాద్ జూనియర్ కళాశాల గేట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మాధవరెడ్డి, అధ్యాపకులు

శంషాబాద్ రూరల్,ఆగస్టు 22 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవ రెడ్డి తెలిపారు. గురువారం శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. అంతకుముందు కళాశాలకు నూతనంగా ఏర్పాటు చేసిన గేట్‌ను ప్రారంభించారు. బదిలీపై వెళ్లిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జూనియర్ సీనియర్ తేడా లేకుండా విద్యార్థులు కలిసి మెలిసి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: ఓయూ పరిధిలోని పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 5లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 12వ రకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలు అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూడవచ్చని సూచించారు.

లా కోర్సుల్లో ఎన్ఐక్యూ కోటా ప్రవేశాలకు ఆహ్వానం

ఓయూ లా కళాశాలలో వివిధ కోర్సుల్లో నేషనల్ ఇంటిగ్రేషన్ కోటా (ఎన్ఐక్యూ)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సులతో పాటు కాన్‌స్టిట్యూషనల్ లా, కార్పొరేట్ అండ్ సెక్యూరిటీస్ లా, లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ లా విభాగాల్లో ఎల్ఎల్ఎం (డే), ఆల్టర్నేట్ డిస్ప్యూట్ రిసొల్యూషన్, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ ఎకానమిక్ లా, క్రిమినాలజీ అండ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ విభాగాల్లో ఎల్ఎల్ఎం (ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు ఫారాలను వచ్చే నెల 10లోగా కళాశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

2 నుంచి సెల్ఫ్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో వచ్చే నెల 2వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు వేర్వేరుగా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తివివరాలకు 90004 44973, 79899 03001 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జంతు సంరక్షణ సామాజిక బాధ్యత

హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రవల్లిక, తదితరులు

హిమాయత్‌నగర్, ఆగస్టు 22: జంతువులను సంరక్షించి వాటి హక్కులను పరిరక్షించాలని కోరుతూ ఈనెల 24న సంజీవయ్య పార్కు నుంచి పీపుల్స్ ప్లాజా వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వేగన్స్ ఆఫ్ తెలంగాణ సంస్థ నిర్వాహకురాలు, హైకోర్టు న్యాయవాది ప్రవల్లిక తెలిపారు. ర్యాలీకి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతువుల పట్ల జాలి చూపాలని భారత రాజ్యాంగం 51-ఏ అధికరణ సూచిస్తుందని, జంతువుల ఆవాసాలు ధ్వంసం కావడం, అటవీ ప్రాంతాలు అన్యాక్రాంతం కావడంతో వాటికి రక్షణ కరువైందన్నారు. భూమి మీద మనుషులతోపాటు ఎన్నో రకాల జంతువులు ఉన్నాయని, మానవులు మాంసం, వినోదం కోసం వాటి ప్రాణాలను తీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సృష్టిలో ప్రతి జీవి సహజ ఆవరణ వ్యవస్థలో భాగమేనని, జంతువులను ప్రేమించి ఆదరించడం మానవత్వమని పేర్కొన్నారు. జంతువులు మూగ జీవాలైన ప్పటికీ మనుషుల ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. జంతువులను సంరక్షించాల్సిన అవసరం ప్రతి పౌరుడిపై ఉందన్నారు. సినీ దర్శకుడు శశికిరణ్ తిక్క ర్యాలీని ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు సూరజ్, ఇషాంత్, రఘురామ్, పంచ్ తదితరులు పాల్గొన్నారు.

26న జలవిహార్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాకర్ల రాధ, నర్రా లక్ష్మి, అనిల్

ఖైరతాబాద్, ఆగస్టు 22 : మాధవ సేవా ఫౌండేషన్, ఇస్కాన్ సంయుక్తాధ్వర్యంలో ఈనెల 26న జలవిహార్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్తాపకురాలు కాకర్ల రాధ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో వేడుకల పోస్టర్లను రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు నర్రా లక్ష్మి, పర్యావరణ వేత్త అనిల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను వృథా చేసుకుంటున్నారన్నారు. యువతను భక్తి మార్గం వైపు నడిపించేందుకు 26న జరిగే జన్మాష్టమి వేడుకల్లో డీజే స్పిర్చువల్ మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భక్తి పాటలతో నృత్యాలు చేసి భక్తి అనుభూతిని పొంద వచ్చన్నారు. అలాగే అన్నప్రసాద సేవ, దాండియా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సెల్ఫ్ డిఫెన్స్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, మేడారంలో 500 మొక్కలు నాటుతామని నర్రా లక్ష్మి, పర్యావరణ వేత్త అనిల్ తెలిపారు.

రేపటి నుంచి వివిధ రకాల పోటీలు

హిమాయత్‌నగర్ : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఈ నెల 26న కూకట్‌పల్లిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కూకట్‌పల్లి ఇస్కాన్ సంస్థ మహిళా విభాగం కోఆర్డినేటర్ శ్రీవాణి తెలిపారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో వేడుకల కరపత్రాలను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు 6 నుంచి 18 వయసు బాలబాలికలకు గానం, నృత్యం, కలరింగ్, డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్, శ్లోక పఠనం వంటి వాటిపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు జరుగుతాయని, 27న ఇస్కాన్ సంస్థ వ్యవస్థాపకుడు ఆచార్య ఏసీ భక్తి వేదాంత స్వామి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు లలితకాబ్రా, అంజనాదేవి, సునీల్‌రారి పాల్గొన్నారు.

మల్లో పెళ్లాడాలని మాజీ భర్త వేధింపులు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు.. నిందితుడి అరెస్ట్

వెంగళరావునగర్, ఆగస్టు 22 : మనస్పర్థలతో ఆ దంపతులు విడిపోయారు.. విడాకులిచ్చిన ఆమెను మళ్లీ పెండ్లి చేసుకోవాలని మాజీ భర్త వేధిస్తున్న ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన వై. శివకుమార్(36)తో వి.దుర్గాదేవి(28)కి 2019లో వివాహమైంది. కొన్నాళ్ల పాటు వీరి కాపురం సవ్యంగానే సాగింది. ఏడాది తర్వాత భర్త శివకుమార్ దుర్గాదేవిని వేధించ సాగాడు. ఎంతకీ భర్తలో మార్పు రాకపోవడంతో 2021లో ఆమె విడాకులు తీసుకుంది. అనంతరం తనను మళ్లీ పెండ్లి చేసుకోవాలని.. లేకుంటే చంపేస్తానంటూ గత ఏప్రిల్ నుంచి దుర్గాదేవి ఇంటికి వచ్చి శివ బెదిరిస్తున్నాడు. ఆమె పని చేసే షాపింగ్ మాల్ వద్దకు వెళ్లి భయాందోళనకు గురిచేశాడు. తోటి స్నేహితురాలు అడ్డుకోబోగా ఆమెని కొట్టి గాయపర్చాడు. బుధవారం ఉదయం దుర్గ ఇంటికి వెళ్లి తలుపులు విరగొడ్డాడు. మళ్లీ పెండ్లి చేసుకోకుంటే బతకనివ్వను.. చంపేస్తానని బెదిరించాడు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకోవడంతో శివ అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా శివ రౌడీషీటర్ అని.. అతడితో తనకు ప్రాణహాని ఉందని బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు శివను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కళలను భావితరాలకు అందజేయాలి

రవీంద్రభారతి,ఆగస్టు 22: కళలను భావితరాలకు అందజేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు వరంగల్ ఈవీ శ్రీనివాస్, ప్రముఖ సినీనిర్మాత జీవీ నాయుడు, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలక